

పొలాల్లో 'మృత్యుపాశాలు'

పంట పొలాల్లో అస్తవ్యస్తంగా ఉన్న విద్యుత్ తీగలు అన్నదాతల పాలిట శాపంగా మారాయి.

- 8లో ▸



ఎస్సారెస్పీపై పట్టింపేది?

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు సమస్యలకు నిలయంగా మారింది. ప్రాజెక్టు ఆనకట్టపై విద్యుత్, పూడిక ఇలా ఎన్నో సమస్యలు నెలకొన్నాయి.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
40.1 /25.5

ఉదయం ఎండ వేడిమి ఉంటుంది. ఉక్కపోతగా ఉంటుంది. ఆకాశం మేఘావృతమవుతుంది. అక్కడక్కడ జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

14వ తేదీ నుంచి సర్టిఫికెట్ వెరిఫికేషన్

ఖలీల్‌వాడి: ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థులకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఈనెల 14 నుంచి ప్రారంభం కానుంది. అభ్యర్థులు తమ ఇంటిమేషన్ లెటర్లను ఆదివారం ఉదయం 8 గంట నుంచి ఈ నెల 13వ తేది రాత్రి 8 గంటల వరకు డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం టీఎస్‌ఎల్‌పీఆర్‌బీ తెలిపింది. ఉమ్మడి నిజామాబాద్‌కు చెందిన అభ్యర్థులు తమకు కేటాయించిన కేంద్రంలో ఉదయం 9 గంటలకు రిపోర్టు చేయాలని, ఇంటిమేషన్ లెటర్లను తప్పకుండా తీసుకురావాలని తెలిపారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో సివిల్, ఏఆర్ పోస్టులు 640 ఉండగా వీటికి ఏప్రిల్ 30న 5,285 మంది అభ్యర్థులు పరీక్షలు రాశారు. ఎస్సై, కానిస్టేబుల్‌కు సంబంధించిన మెయిన్స్ ఫలితాలను ఏప్రిల్ 30న విడుదల చేశారు. ఇందులో ఉత్తీర్ణత సాధించిన వారు తమకు కేటాయించిన తేదీల ప్రకారం పోలీస్‌కమిషనరేట్ కార్యాలయంలో సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేసుకోవాల్సి ఉంటుంది.

ఆన్‌లైన్ క్విజ్ పోటీలను విజయవంతం చేయాలి



బాల్కొండ: యువశక్తిని మేల్కొలిపే దిశగా ఈనెల 18న నిర్వహించే రాజీవ్‌గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్‌పోటీలను విజయవంతం చేయాలని డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి అన్నారు. ఆదివారం బాల్కొండ మండలం కిసాన్‌నగర్‌లో కాంగ్రెస్ ఉమ్మడి బాల్కొండ మండల ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లోని 16 నుంచి 35 ఏళ్ల యువతీ యువకులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. జిల్లా నుంచి 20వేల మందికి తగ్గకుండా యువతీ యువకులు పోటీలో పాల్గొనేలా కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలన్నారు. ఈనెల 17వ తేదీ వరకు 7661899899 నంబర్‌కు మిస్డ్‌కాల్ ఇచ్చి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి క్యాతం గంగారెడ్డి, బాల్కొండ, ముప్కాల్, మెండోరా మండలాల పార్టీ అధ్యక్షులు వెంకటేశ్, గంగాధర్, ముత్యంరెడ్డి, నాయకులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో 2కే రన్

ఖలీల్‌వాడి: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకల్లో భాగంగా సోమవారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో 2కే రన్ నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి సీపీ ప్రవీణ్‌కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. నగరంలోని పులాంగ్ చౌరస్తా నుంచి ప్రగతి హాస్పిటల్, ఎల్‌ఐసీ చౌరస్తా, కోర్టు చౌరస్తా, ఎన్టీఆర్ చౌరస్తా, పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ముగింపు ఉంటుందన్నారు. సోమవారం ఉదయం 7:30 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా జిల్లా జడ్జి సునీత కుంచాల హాజరవుతారని పేర్కొన్నారు.

నేటి నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు


నిజామాబాద్‌అర్బన్: ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఇందుకోసం జిల్లాలో 37 పరీక్ష కేంద్రాల్లో అధికారులు ఏర్పాట్లు చేశారు. జిల్లా వ్యాప్తంగా 17,256 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. ఫస్టియర్ విద్యార్థులకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వర కు, సెకండియర్ విద్యార్థులకు మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలు జరుగనున్నాయి.

నర్సన్నపల్లిలో మద్యపాన నిషేధం

కామారెడ్డి రూరల్: గ్రామంలో మద్యపానాన్ని నిషేధిస్తూ కామారెడ్డి మండలం నర్సన్నపల్లి వాసులు ఏకగ్రీవంగా తీర్మానించారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో సర్పంచ్, వార్డు సభ్యులతో పాటు కులపెద్దలు, గ్రామస్తులు ఆదివారం సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. గ్రామంలో ఎవరైనా మద్యం విక్రయిస్తే వారికి రూ. 50 వేలు, ఎవరైనా మద్యం కొనుగోలు చేస్తే వారికి రూ. 5 వేలు, జరిమానా విధించాలని నిర్ణయించారు. మద్యానికి సంబంధించిన సమాచారం ఇస్తే వారికి రూ. 5వేలు ప్రోత్సాహక బహుమతి కూడా ఇస్తామని ప్రకటించారు. రోడ్ల వెంబడిగానీ, బహిరంగ ప్రదేశాల్లో గాని మద్యం సేవించిన వారికి రూ. 5వేలు జరిమానా విధించాలని సమావేశంలో నిర్ణయించారు.

మోగనున్న బడి గంట

బడి గంట మళ్లీ మోగనుంది. వేసవి సెలవుల అనంతరం సోమవారం నుంచి జిల్లాలో పాఠశాలలు పున: ప్రారంభం కానున్నాయి. గత ఏప్రిల్ 24న ప్రారంభమైన వేసవి సెలవులు ఆదివారం ముగిశాయి. దీంతో నేటి నుంచి తిరిగి విద్యార్థులు బడిబాట పట్టనున్నారు.



- నేటి నుంచి పాఠశాలలు పున: ప్రారంభం
- బడుల్లో పరిష్కారం కాని సమస్యలు
- మొక్కుబడిగా బడిబాట
- కొనసాగుతున్న పుస్తకాల సరఫరా

నిజామాబాద్‌అర్బన్: జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు తెరుచుకోనున్నాయి. కొన్ని ప్రైవేటు పాఠశాలలు ఎండల తీవ్రత దృష్ట్యా విద్యార్థులకు హాఫ్‌డే కొనసాగించనున్నాయి. కానీ అధికారికంగా మా త్రం ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి ఉత్తర్వులు రాలేదని జిల్లా విద్యాశాఖ పేర్కొంది. సెలవులు పూర్తయి పాఠశాలలు పున:పారంభం అవుతున్నా ప్రభుత్వ బడుల్లో సమస్యలు పరిష్కారం కాలేదు.

జిల్లా వ్యాప్తంగా 1,756 పాఠశాలలు

జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలలు కలిపి 1,756 ఉండగా మొత్తం 287820 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. 693 ప్రాథమిక పాఠశాలలు ఉండగా 38,139 మంది విద్యార్థులు ఉన్నారు. 116 ప్రాథమికోన్నత పాఠశాలల్లో 9,160 మంది విద్యార్థులు చదువుతున్నారు. 230 ఉన్నత పాఠశాలలు ఉండగా 39,912 మంది విద్యార్థులు ఉన్నారు. రాష్ట్ర పరిధిలోని పాఠశాలలు 112 ఉండగా 15,066 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. 25 కేజీబీవీల్లో 5,679 మంది విద్యార్థులు చదువుతున్నారు. మోడల్ స్కూళ్లు 10 ఉండగా 775 మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రైవేటు పాఠశాలలు 468 ఉండగా 1,40,394 మంది విద్యార్థులు ఉన్నారు. వీటితో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ పాఠశాలలున్నాయి. అయితే పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించలేదు. అనేక బడుల్లో సమస్యలు నెలకొని ఉన్నాయి.

పూర్తిస్థాయిలో అందని పుస్తకాలు

జిల్లాలో పాఠ్య పుస్తకాల పంపిణీ కొనసాగుతోంది. పాఠశాలలు తెరవకముందే పుస్తకాలు అందించాలన్న లక్ష్యం ఏ ఒక్క సంవత్సరం కూడా నెరవేరడం లేదు. ఈ యేడు పుస్తకాల సరఫరా ఇంకా కొనసాగుతోంది. జిల్లాకు 8,00,380 పుస్తకాలు అవసరం కాగా ఇప్పటివరకు 7,25,043 పుస్తకాలు వచ్చాయి. ఇంకా 74,997 పుస్తకాలు రావాల్సి ఉన్నాయి. ఇప్పటివరకు మండల కేంద్రాలకు 2,99,955 పుస్తకాలు పంపిణీ చేశారు. ప్రస్తుతం పాఠశాలలు ప్రారంభం కానున్నా పుస్తకాలను పూర్తిస్థాయిలో అందించలేదు.

నత్తనడకన 'మన ఊరు-మనబడి' పనులు

జిల్లాలో మన ఊరు-మనబడి పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. గతేదాది ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టింది. ఇందులో భాగంగా జిల్లాలో 1,156 పాఠశాలల్లో 407 స్కూళ్లను అభివృద్ధి చేయాలని ఎంపిక చేశారు. ఇందులో 405 పాఠశాలలకు పరిపాలన అనుమతులు వచ్చాయి. కానీ ఇప్పటివరకు జిల్లాలో 31 పాఠశాలల పనులు మాత్రమే పూర్తి చేశారు. ఇంకా 262 పాఠశాలల్లో పనులు కొనసాగుతున్నాయి. 50 బడుల్లో పనులు ప్రారంభమే కాలేదు.

ఉపాధ్యాయుల కొరత.. బోధనకు ఇబ్బందులు

జిల్లాలో 1,156 ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత కొన్ని సంవత్సరాలుగా తీవ్రంగా వేధిస్తోంది. జిల్లాలో ఇప్పటివరకు 972 టీచర్ పోస్టులు ఖాళీలుగా ఉన్నాయి. దీంతో పాఠశాలల్లో అనేక ఖాళీలు ఉన్నాయి. కనీసం విద్యావలంటీర్లను కూడా నియమించకపోవడంతో విద్యాబోధన అస్తవ్యస్తంగా తయారైంది.

మొక్కుబడిగా..

జిల్లాలో ఈనెల 3 నుంచి అధికారులు బాడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు మొత్తం 8,105 మంది విద్యార్థులను అధికారులు ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించారు. అయితే ఇందులో 4,103 మంది విద్యార్థులు అంగన్‌వాడీ కేంద్రాల నుంచి చేర్పించిన వారే ఉన్నారు. వివిధ ప్రైవేటు స్కూళ్ల నుంచి కేవలం 4,002 మంది విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించారు. ప్రైవేటు స్కూళ్ల విద్యార్థులను చేర్పిచడంలో విద్యాశాఖ అధికారులు విఫలమయ్యారనే విమర్శలు ఉన్నాయి.

హాజరు 62 శాతమే..

- ముగిసిన గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్ష
- పరీక్ష రాసిన 7,957 మంది అభ్యర్థులు
- కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్, ఇన్‌చార్జి సీపీ




నగరంలోని ఓ పరీక్ష కేంద్రం వద్ద హాల్‌టికెట్ నంబర్లు చూసుకుంటున్న అభ్యర్థులు

నిజామాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలో గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. జిల్లాలో 12,860 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా ఇందులో 7,957 మంది మాత్రమే పరీక్ష రాశారు. 4,904 మంది అభ్యర్థులు గైర్హాజయ్యారు. 62శాతం మాత్రమే హాజరు నమోదైంది. ఉదయ 10.30 గంటలకు పరీక్ష ప్రారంభం కాగా మధ్యాహ్నం ఒంటి గంటకు ముగిసింది. కాగా గ్రూప్–1 ప్రిలిమ్స్ పరీక్షా కేంద్రాలను కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తనిఖీ చేశారు. ఆదర్శ హిందీ విద్యాలయ(హరిచరణ్ మార్వాడీ) కళాశాలతో పాటు పద్మనగర్‌లోని విశ్వశాంతి జూనియర్ కాలేజీలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. అభ్యర్థుల హాజరు, సిబ్బంది హాజరుపై ఆరా తీశారు. నిబంధనలకు అనుగుణంగానే నిర్ణీ త సమయంలో ప్రశ్నపత్రాలను తెరిచారా? లేదా? అన్నది నిర్ధారణ చేసుకున్నారు. పరీక్షా కేంద్రాల్లోని గదులను సందర్శిస్తూ, అభ్యర్థులకు కల్పించిన సదుపాయాలను గమనించి పర్యవేక్షకులకు పలు సూచనలు చేశారు. కలెక్టర్ వెంట పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్ లైజనింగ్ అధికారులు ఉన్నారు. కాగా కాకతీయ కళాశాలలో గంగా క్యాంపస్ సెంటర్‌లో ప్రశ్నాపత్రాల బుక్‌లెట్‌లో మూడు ప్యాకెట్లు తక్కువగా వచ్చాయని పరీక్ష కేంద్రం సూపరింటెండెంట్ వెంటనే జిల్లా పరీక్షల అధికారులకు తెలపగా.. వెంటనే ప్రశ్నాపత్రాలను అందించారు. దీంతో అభ్యర్థులకు 14 నిమిషాలు ఆలస్యంగా పరీక్ష ప్రారంభమైంది. వారికి సమయం పొడిగించారు.

గ్రూప్-1 పరీక్ష కేంద్రాలను పరిశీలించిన ఇన్‌చార్జి సీపీ

ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న గ్రూప్–1 పరీక్ష కేంద్రాలను ఆదివారం ఇన్‌చార్జి సీపీ ప్రవీణ్‌కుమార్ పరిశీలించారు. సెంటర్ల వద్ద పోలీసుల బందోబస్తు వివరాలను ఏసీపీ కిరణ్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు.



నగరంలోని ఓ పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

మొరం తవ్వకంపై ఇరు గ్రామాల మధ్య ఘర్షణ



చెరువు వద్ద గుమిగూడిన ఇరు గ్రామాల ప్రజలు

ఇందల్వాయి: డిచ్‌పల్లి మండలంలోని అమృతాపూర్, ఒడ్డెరకాలనీ గ్రామాల మధ్య ఎర్రకుంటలో మొరం తవ్వకాల విషయంలో ఆదివారం ఉదయం ఘర్షణ చోటు చేసుకుంది. అమృతాపూర్ గ్రామస్తులు తమ గృహావసరాల కోసం మొరం తరలిస్తుండగా ఒడ్డెర కాలనీవాసులు అడ్డుకున్నారు. దీంతో ఇరు గ్రామాల ప్రజల మధ్య ఉద్రిక్త వాతావరణం నెలకొంది. విషయం తెలుసుకున్న పోలీసులు ఎర్రకుంట చెరువు వద్దకు చేరుకొని నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అయినా శాంతించని ఇరు గ్రామాల ప్రజలు రెండు గంటల పాటు వాగ్వాదానికి దిగారు. మొరంలో తమకు వాటా ఇస్తామన్న అమృతాపూర్ గ్రామస్తులు మాట తప్పారని ఒడ్డెర కాలనీవాసులు ఆరోపించారు. మొరాన్ని తాము గ్రామ అవసరాలకే వాడుకుంటున్నామని.. అమ్ముకోవడం లేదని అమృతాపూర్ గ్రామస్తులు తెలిపారు. పోలీసులు సర్ది చెప్పడంతో శాంతించిన ఇరు గ్రామాల ప్రజలు సమస్య పరిష్కారం కోసం ఎవరికి వారు రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ వద్దకు వెళ్లారు.

బదిలీలకు కసరత్తు..!

- పోలీస్‌శాఖలో త్వరలో ట్రాన్స్‌ఫర్స్
- కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు..
- బదిలీకానున్న కమిషనరేట్ పరిధిలో సీఐలు, ఎస్సైలు
- అనుకూలమైన స్థానం కోసం ప్రజాప్రతినిధుల చుట్టూ ప్రదక్షిణలు
- ఈ నెల 31 వరకు ప్రక్రియ పూర్తయ్యే అవకాశం



ఖలీల్‌వాడి : తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో నిజామాబాద్ పోలీస్‌కమిషనరేట్ పరిధిలో బదిలీలకు కసరత్తు జరుగుతోంది. ఎన్నికలతో ప్రత్యక్షంగా, పరోక్షంగా సంబంధాలు ఉండే సీఐలు, ఎస్సైల బదిలీలు జూలై 31వ తేదీ వరకు చేపట్టాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. దీంతో జిల్లాలో పనిచేస్తున్న సీఐలు, ఎస్సైలను బదిలీ చేయడానికి పోలీస్‌శాఖ కసరత్తు నిర్వహిస్తోంది. మూడేళ్లు పూర్తి చేసుకున్న ఎస్సైలు, సీఐలతో పాటు జిల్లాకు చెందిన పోలీస్ అధికారులను బదిలీ చేయడానికి పోలీస్‌శాఖ వివరాలను సేకరించింది. ఇప్పటికే జిల్లాలో సీపీ పోస్టుతో పాటు ముగ్గురు డీసీపీలు, ఇద్దరు ఏసీపీ పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలో 32 పోలీస్‌స్టేషన్‌లు ఉండగా.. 26 మంది సీఐలు, 81 మంది ఎస్సైలు పనిచేస్తున్నారు. ఈ నెల 2 నుంచి 22 వరకు తెలంగాణ దశాబ్ది ఉండడంతో ఈ నెల ఆఖరు వరకు బదిలీల ఉత్తర్వులు వెలువడే అవకాశాలున్నట్లు పోలీస్‌వర్గాల్లో చర్చ జరుగుతోంది. అయితే ఇతర జిల్లాల నుంచి కొంత మంది అధికారులు ఇటీవలే సీఐలు, ఎస్సైలుగా బదిలీపై వచ్చారు. వీరికి బదిలీ అయ్యే అవకాశాలు లేవు. మూడేళ్లుగా ఒకే పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న పోలీస్‌లతో పాటు, సొంత జిల్లాలో ఉన్న వారికి బదిలీలు తప్పవనే చర్చ జరుగుతోంది. దీంతో బదిలీ తప్పదని భావిస్తున్న సీఐలు, ఎస్సైలు తమకు అనుకూలంగా ఉండే ప్రాంతాలకు వెళ్లడానికి ప్రయత్నాలు ముమ్మరం చేశారు. పోలీస్‌కమిషనరేట్ పరిధిలో కొంత మంది ఎస్సైలకు సీఐగా పదోన్నతి రావాల్సి ఉంది. అయితే ప్రభుత్వం సీఐలుగా ఉన్న వారికి డీఎస్పీలు లేక ఏసీపీలుగా పదోన్నతి కల్పించింది. కానీ వారి స్థానంలో ఎస్సైలను సీఐలుగా పదోన్నతి ఇప్పట్లో ఇచ్చే అవకాశాలు లేకపోవడంతో దాదాపు జిల్లాకు చెందిన 20 మంది ఎస్సైలు పదోన్నతి పొందలేకపోతున్నట్లు తెలుస్తోంది. అయితే రాష్ట్ర వ్యాప్తంగా మల్టీజోనల్‌లో 38 మంది ఎస్సైలకు సీనియారిటీ ప్రకారం సీఐలుగా పదోన్నతి లభించే అవకాశాలున్నాయి. కాన్నీ ఇందులో జిల్లాకు చెందిన ఎస్సైలకు ఇప్పుడే పదోన్నతి లభించే అవకాశాలు లేనట్లు తెలుస్తోంది.

పొరుగు జిల్లాలపై ఆసక్తి..

జిల్లాలో మూడేళ్లుగా పనిచేసిన సీఐలు, ఎస్సైలు నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలోని జగిత్యాల, నిర్మల్ జిల్లాల్లో పనిచేయడానికి ఆసక్తి చూపుతున్నారు. ఇందుకోసం మంత్రులు, ఎమ్మెల్యేల సిఫార్సు లేఖల కోసం తిరుగుతున్నట్లు తెలుస్తోంది. అయితే దశాబ్ది ఉత్సవాల తర్వాత సీపీతో పాటు డీసీపీ పోస్టుల భర్తీ తర్వాత సీఐలు, ఎస్సైల బదిలీలు జరుగుతాయని చర్చ పోలీస్‌శాఖలో జరుగుతోంది.

బీసీల్లో కొందరికే సాయం..!

- కులవృత్తులపై ఆధారపడిన వారికే ఆర్థిక సాయం
- ఇతర వ్యాపారాలు చేస్తే సాయం వర్తించని వైనం
- నిబంధనల మార్పుపై పెదవి విరుస్తున్న దరఖాస్తుదారులు

మోర్తాడ్(బాల్కొండ) : మోర్తాడ్‌కు చెందిన రాకేశ్ గౌడ్ వీల్ అలైన్‌మెంట్ వ్యాపారం నిర్వహిస్తున్నా డు. ఇతను తన వ్యాపారాభివృద్ధికి బీసీ కార్పొరేషన్ ద్వారా ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన రూ. లక్ష సాయం కోసం దరఖాస్తు చేసుకోవాలని భావించాడు. తన కులవృత్తి కాకుండా మరో వ్యాపారం చే స్తుండడంతో ఆర్థిక సాయం అందే పరిస్థితి కనిపించడం లేదు. ఇది ఒక్క రాకేశ్‌గౌడ్‌కు ఎదురవుతున్న సమస్య కాదు. ఎంతో మంది బీసీలకు కులవృత్తి కా కుండా ఇతర వ్యాపారాలు నిర్వహిస్తే వాటి వృద్ధి కో సం ఆర్థిక సాయం అందించే పరిస్థితి లేదు. ఫలితంగా బీసీలలో కొందరికే సాయం అందుతుందనే వా దన వినిపిస్తోంది. గతంలో బీసీ కార్పొరేషన్ ద్వారా ప్రతి ఏడాది రాయితీ రుణాలను అందించేవారు. తె లంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి బీసీ కార్పొరేషన్ ద్వారా కేవలం ఒకటి రెండుమార్లు మాత్రమే రాయితీ రుణాల పంపిణీ జరిగింది. అదికూడా అ సంపూర్తిగానే రాయితీ రుణాలను లబ్ధిదారులకు అందించారు. బీసీలకు రూ. లక్ష సాయాన్ని ప్రభు త్వం ప్రకటించగానే ఎంతో మంది వెనుకబడిన తరగతుల వారిలో సంతోషం వ్యక్తమైంది. కానీ ఆర్థిక సాయం కేవలం కులవృత్తులపైనే ఆధారపడినవారికి అని చెప్పడంతో అనేక మంది అసహనానికి గురవుతున్నారు.

15 కులాల వారికే సాయం..

ప్రభుత్వం ప్రకటించిన ప్రకారం నాయీబ్రహ్మణ, రజకులు, సాగర ఉప్పర, కుమ్మరి, అవుసలి, కంసాలి, కమ్మరి, కంచరి, వడ్రంగి, కృష్ణ బలిజ పూసల, మేదరి, వడ్డెర, ఆరెకటిక, దర్జీ, అత్యంత వెనుకబడిన తరగతుల వారికి మాత్రమే సాయం అందించనున్నారు. వృత్తికి సంబంధించిన పరికరాల కొనుగోలు, వృత్తి పనికి అవసరమైన రా మెటీరియల్ కొనుగోలుకు మాత్రమే సాయాన్ని వినియోగించుకోవాల్సి ఉంది. ఇదిలా ఉండగా బీసీలలో గౌడ, మున్నూరుకాపు, గొల్ల, కుర్మ, ముదిరాజ్, పద్మశాలి, దూదేకుల, మైనారిటీలు తదితరులు న్నారు. గొల్ల, కుర్మలకు మాత్రం రాయితీ గొర్రెల పథకాన్ని వర్తింపజేస్తుండడంతో వీరికి సాయం ప్రకటించకపోయినా ఇబ్బంది లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. కులవృత్తి కాకుండా ఇతర వ్యాపారాలు చేసేవారిలో బీసీలే అధికంగా ఉన్నారు. కిరాణా దుకాణాలు, సిమెంట్, హార్డ్‌వేర్, ఫొటో, వీడియో గ్రఫీ, రంగులు, ఎలక్ట్రికల్ దుకాణాలు, ట్రాన్స్‌పోర్టు వాహనాలు ఇతరత్రా వ్యాపారాలను అనేక మంది బీసీలు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం ప్రకటించిన సాయం తమకు కూడా అందిస్తే తమ వ్యాపారాన్ని మరింత అభివృద్ధి చేసుకుంటామని బీసీలు చెబుతున్నారు.



గత దరఖాస్తులు బుట్టదాఖలేనా..?

నాయీబ్రహ్మణులు, విశ్వబ్రాహ్మణులు అనేక మంది తమ కుల సంఘాల ద్వారా ప్రభుత్వ సాయం కోసం గతంలో దరఖాస్తులను అందించారు. ప్రభుత్వమే పైన పేర్కొన్న రెండు సామాజిక వర్గాల వారికి వృత్తిపరమైన సామాగ్రి కొనుగోలు కోసం ప్రకటన చేయగా ఆయా కుల సంఘాలు తమ సభ్యుల నుంచి దరఖాస్తులను స్వీకరించి అధికార యంత్రాంగానికి అందించారు. ఇప్పటి వరకు ఎలాంటి సాయం అందలేదు. కొత్తగా దరఖాస్తులను స్వీకరిస్తుండడంతో గతంలోని దరఖాస్తులు బుట్ట దాఖలేనా అనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

బీసీలందరికీ సాయం అందించాలి



బీసీల్లో కొన్నికులాల వారికే ఆర్థిక సాయం అందించాలని ప్రభుత్వం నిర్ణయించడం సరైంది కాదు. ఉద్యోగాల లేక స్వయం ఉపాధి పొందుతూ జీవిస్తున్న ఎంతో మంది బీసీలకు ఆర్థిక సాయం లేక అప్పుల భారం మోయాల్సి వస్తోంది. అందరికీ సాయం అందిస్తేనే బాగుంటుంది.

– గంగాధర్ గౌడ్, తిమ్మాపూర్

కులవృత్తి చేయని వారు బీసీలు కాదా..



కులవృత్తిని చేసేవారే ప్రభు త్వం దృష్టిలో బీసీలా, కొందరికి సాయం అందించి మిగిలిన వారికి ఎలాంటి సాయం అందించకపోతే మిగతావారు ఎలా బతకాలి. ప్రభుత్వం తీరు సరిగ్గా లేదు. బీసీలలో అర్హులైన అందరికీ ఆర్థిక సాయం అందించాలి. లేకుంటే ఆందోళనలు చేస్తాం.

–జక్కం అశోక్, మోర్తాడ్

క్లుప్తంగా

బీజేపీలో చేరిన సర్పంచ్



ఎడపల్లి: మండలంలోని ఏఆర్పీ క్యాంప్‌నకు చెందిన బీఆర్ఎస్ సర్పంచ్ అలేఖ్య మహేష్‌తోపాటు నలుగురు వార్డు సభ్యులు ఆదివారం ఎంపీ అర్వింద్ సమక్షంలో బీజేపీలో చేరారు. హైదరాబాద్‌లోని ఎంపీ నివాసంలో సర్పంచ్, 50 మంది అనుచరులతో బీజేపీ తర్థం పుచ్చుకున్నారు. ఎంపీ వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలతో బీజేపీలో చేరినట్లు సర్పంచ్ అలేఖ్య తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం సర్పంచ్‌లను పట్టించుకోవడం లేదన్నారు. బోధన్ నియోజకవర్గ నాయకులు మోహన్‌రెడ్డి, ప్రకాష్‌రెడ్డి ఉన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ



ఇందల్వాయి(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీలో ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడానికి ఎస్ఎఫ్‌డీ (స్టూడెంట్ ఫర్ డెవలప్‌మెంట్) ఆధ్వర్యంలో మేక్ క్యాంపస్ ప్లాస్టిక్ ఫ్రీ పోస్టర్‌లను ఆదివారం ఆవిష్కరించారు. ఎస్ఎఫ్‌డీ కన్వీనర్ నవీన్ కుమార్ మాట్లాడుతూ ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని దృష్టిలో ఉంచుకొని ప్లాస్టిక్ రహిత భారత్ అనే నినాదంతో ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడానికి దేశ వ్యాప్తంగా ఎస్ఎఫ్‌డీ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బచ్చుబోయిన శివ, ప్రమోద్, కార్తీక్, రాజు, మహేష్, జయంత్ తదితరులు పాల్గొన్నారు.

పద్యకవి సమ్మేళనంలో నటేశ్వర శర్మ



కామారెడ్డి అర్బన్ : తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఆదివారం హైదరాబాద్ రవీంద్రభారతిలో రాష్ట్ర అవతరణ ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన సాహిత్య సమ్మేళనంలో కామారెడ్డికి చెందిన విశ్రాంత అధ్యాపకులు, అష్టావధాని డాక్టర్ అయాచితం నటేశ్వర శర్మ పాల్గొన్నారు. ఆయన అధ్యక్షతన పద్యకవి సమ్మేళనం నిర్వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో నటేశ్వర శర్మను ప్రభుత్వం తరఫున సన్మానించారు. ఈ కార్యక్రమంలో సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరి గౌరీశంకర్, ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న, గ్రంథాలయ సంస్థ రాష్ట్ర చైర్మన్ అయాచితం శ్రీధర్ పలువురు సాహితీవేత్తలు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

రెంజల్: మండలంలోని కూనేపల్లి గ్రామానికి చెందిన రొడ్డ రూప అదృశ్యమైనట్లు కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారని ఎస్సై సాయన్న తెలిపారు. ఈ నెల 6న రూపను భర్త రవి వేధించడంతో ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. పలుచోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. దీంతో ఆమె తండ్రి సాయిలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై చెప్పారు.

రుద్రూర్ పాఠశాలలో అగ్నిప్రమాదం

వర్ని: రుద్రూర్ మండల కేంద్రంలోని జవహర్ నగర్ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో అగ్ని ప్రమాదం జరిగింది. పాఠశాలలోని స్టోర్ రూమ్ లో శనివారం రాత్రి మంటలు అంటుకొని పుస్తకాలు తగలబడిపోయినట్లు స్థానికులు వెల్లడించారు. పాఠశాల స్టోర్ రూమ్ కిటికీ తలుపులు తెరిచి ఉండడంతో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు అంటించి పడవేశారని చెప్పారు. అటుగా వెళ్తున్న వారు గమనించి మంటలను ఆర్పి వేసినట్లు స్థానికులు తెలిపారు.

పొలాల్లో 'మృత్యుపాశాలు'

- ప్రమాదకరంగా వేలాడుతున్న విద్యుత్ తీగలు
- ఆందోళన చెందుతున్న అన్నదాతలు
- పట్టించుకోని అధికారులు

బోధన్‌రూరల్/తాడ్వాయి: పంట పొలాల్లో అస్తవ్యస్తంగా ఉన్న విద్యుత్ తీగలు అన్నదాతల పాలిట శాపంగా మారాయి. వంగిన స్తంభాలు, వేలాడుతున్న తీగలు రైతులను కలవర పెడుతున్నాయి. వానాకాలం సీజన్ ప్రారంభం కావడంతో అన్నదాతలు పొలం పనుల్లో నిమగ్నమయ్యారు. కోటి ఆశలతో సాగు మొదలు పెడుతున్న అన్నదాతలను పంట పొలాల్లో వంగిన విద్యుత్ స్తంభాలు, వేలాడుతున్న విద్యుత్ తీగలు, కంచెలు లేని టాన్స్‌ఫార్మర్లు భయందోళనకు గురిచేస్తున్నాయి. ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలతో ఎక్కడో చోట మూగ జీవాలు ప్రాణాలు కోల్పోతున్న, రైతులు ప్రమాదాలు గురవుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. బోధన్ డివిజన్‌లోని చాలా గ్రామాల్లో, తాడ్వాయి మండలంలోని వివిధ గ్రామాల్లో విద్యుత్ వైర్లు కిందికి వేలాడడంతో ప్రమాదకరంగా మారాయి. వ్యవసాయ భూముల్లో విద్యుత్ తీగలు, స్తంభాలు ప్రమాదకరంగా ఉన్నాయి. అధికారులు పట్టించుకోకపోవడంతో రైతులే మరమ్మతులు చేసుకుంటున్నారు. రైతులు వ్యవసాయ పనుల నిమిత్తం వెళ్లాలంటే జంకుతున్నారు. కొన్ని గ్రామాల్లో గత్యంతరం లేక కర్రలను పాతి కిందికి వేలాడుతున్న వైర్లకు సపోర్ట్‌గా ఉంచుతున్నారు.

ప్రతి యేటా వానాకాలం, యాసంగి సీజన్‌లకు ముందు పొలాల్లో కిందకు వేలాడుతూన్న కరెంట్ తీగలను, వంగిన స్తంభాలను సరి చేయాలి. కానీ అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. కొన్ని చోట్ల మాత్రమే మరమ్మతులు చేపడుతున్నారు. దీంతో చాలా గ్రామాల్లో మూగజీవాలు, రైతులు కరెంట్ షాక్‌కు బలయిపోతున్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి పొలాల్లో ఉన్న స్తంభాలను, తీగలను సరి చేయాలని రైతులు కోరుతున్నారు.



కొప్పర్తి సమీపంలో వంగిన విద్యుత్ స్తంభాలు



బోధన్ - పెగడపల్లి మార్గంలో..



భూలక్ష్మి క్యాంపు శివారులో వంగిన స్తంభాలు





తాడ్వాయి మండలం దేమికలాన్‌లో వేలాడుతున్న విద్యుత్ తీగలు, లంగ్డాపూర్ శివారులో..

తీగలను సరి చేయాలి



కిందకు వేలాడుతున్న వైర్లను సరి చేయాలి. తీగలు వేలాడటంతో దుక్కలను దున్నుకోలేకపోతున్నాం. వర్షాకాలంలో అనేక ఇబ్బందులకు గురి కావల్సి వస్తుంది. వైర్లను సరిచేసి మా ఇబ్బందులను తొలగించాలి.

– బాపురావు, రైతు, తాడ్వాయి

అధికారులు పట్టించుకోవాలి



పొలాల దగ్గర స్తంభాలు వంగిపోయాయి. ట్రాన్స్‌కో అధికారులు పట్టించుకొని శిథిలావస్థలకు చేరిన స్తంభాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలి.

– రాంచందర్, రైతు, తాడ్వాయి

ప్రతిపాదనలు పంపుతున్నాం

వంగిన స్తంభాలు, వేలాడుతున్న విద్యుత్ తీగలు ఉన్న చోటుకు వెళ్లి పరిశీలిస్తున్నాం. వాటిని సరి చేయడానికి ప్రతిపాదనలు రూపొందించి పైఅధికారులకు పంపిస్తున్నాం. సమస్యలను ఒక్కొక్కటి పరిష్కరిస్తున్నాం.

– భాస్కర్, ఇన్‌చార్జి ఏఈ, తాడ్వాయి

జాతీయస్థాయిలో రాణించాలి



కళా ప్రదర్శన చేసిన విద్యార్థులకు జ్ఞాపికలు అందజేస్తున్న కలెక్టర్



కామారెడ్డి క్రైం: జిల్లాకు చెందిన కళాకారులు, కవులు జాతీయస్థాయిలో రాణించాలని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ ఆకాంక్షించారు. పట్టణంలోని కళాభారతి ఆడిటోరియంలో దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సాహిత్య దినోత్సవం నిర్వహించారు. కవులు తెలంగాణ రాష్ట్ర ఏర్పడిన తర్వాత జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ తమ కవితల ద్వారా తెలియజేశారు. ప్రభుత్వవిప్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలను తెలియజేస్తూ కళాకారులు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కలెక్టర్ జితేష్ విపాటిల్ మాట్లాడుతూ.. కవులు, కళాకారులు పెద్ద సంఖ్యలో సాహిత్య దినోత్సవంలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. కళాకారులకు జ్ఞాపికలను ప్రధానం చేసి సన్మానించారు. ఈకార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేష్ దోత్రే, డీపీఓ శ్రీనివాసరావు, నిర్వాహకులు మనోహర్ రావు, శంకర్, కళాకారులు , కవులు పాల్గొన్నారు.

పేదలకు 'డబుల్' ఇళ్లు అందించాలి

ఖలీల్‌వాడి: బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిదేళ్లు అవుతున్నా పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వలేదని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి అన్నారు. అర్హులకు డబుల్ ఇళ్లు అందించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నగర అధ్యక్షుడు కేశ వేణు ఆధ్వర్యంలో ఆదివారం 10వ డివిజన్‌లో హాథ్ సే హాథ్ జోడో యాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ హయాంలో చేసిన అభివృద్ధిని ఇంటింటికి తిరుగుతూ వివరించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఇచ్చే పథకాలను వివరించారు. రాజీవ్ గృహకల్ప వద్ద ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో కేశ వేణు మాట్లాడారు. వైఎస్సార్ హయాంలో రాజీవ్ గృహకల్ప ద్వారా ఇంటి నిర్మాణాలు చేపట్టిన ఇప్పటి వరకు వాటికి మౌలిక వసతులు బీఆర్ఎస్ ప్రభుత్వం కల్పించలేదన్నారు. నాగారంలో డబుల్ బెడ్‌రూమ్‌లు నిర్మించిన ఇప్పటీ వరకు వాటిని లబ్ధిదారులకు అందించలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రూ.500లకే గ్యాస్ సిలెండర్ అందిస్తామన్నారు.



నాగారంలోని రాజీవ్ గృహకల్ప వద్ద ప్రజలతో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

'చిన్నారి కథలు' పుస్తకం ఆవిష్కరణ



చిన్నారి కథలు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు

మోర్తాడ్: ఏర్గట్ల మండలం తడపాకల్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని డేగల వైష్ణవి రాసిన చిన్నారి కథలు పుస్తకాన్ని ఆదివారం కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఆవిష్కరించారు. నిజామాబాద్‌లోని న్యూ అంబేడ్కర్ భవన్‌లో దశాబ్ది ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన సాహిత్య దినోత్సవంలో భాగంగా పుస్తకం ఆవిష్కరించారు. తెలుగు పండిత్ ప్రవీణ్ శర్మ ఇచ్చిన ప్రేరణతో వైష్ణవి రాసిన పుస్తకం అందరిని అబ్బురపరుస్తుందని అతిథులు అన్నారు. జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు, నిజామాబాద్ మేయర్ నీతూ కిరణ్, అదనపు కలెక్టర్ చిత్ర, సాహితివేత్తలు పీవి చందన్‌రావు, పంచరెడ్డి లక్ష్మణ్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా గ్రూప్-1 ప్రిలిమ్స్




హాల్ టికెట్ నంబర్ చూసుకుంటున్న అభ్యర్థులు



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఇన్‌చార్జి సీపీ

గ్రూప్–1 ప్రిలిమ్స్ పరీక్ష జిల్లాలో ప్రశాంతంగా ముగిసింది. కేంద్రాల వద్ద పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్







ఎస్సారెస్పీపై పట్టింపేది?

- సమస్యల నిలయంలో ప్రాజెక్ట్
- పట్టించుకోని అధికారులు

బాల్కొండ: ఉత్తర తెలంగాణ వరప్రధాయిని శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ సమస్యలకు నిలయంగా మారింది. ప్రాజెక్ట్ ఆనకట్టపై ఇప్పటికి విద్యుత్తు కాంతులు లేవు. స్తంభాలు బల్బులు లేక మోడు పారుతున్నాయి. ప్రాజెక్ట్‌లో రివిట్‌మెంట్, ఆనకట్టపై పిచ్చి మొక్కలు, పూడిక ఇలా చెప్పుకుంటు పోతే అనేక సమస్యలు వెక్కిరిస్తున్నాయి. శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ అంధకారంలో మగ్గుతుంది. ప్రాజెక్ట్ ఆనకట్టకు ఇరువైపుల విద్యుత్తు స్తంభాలు ఉన్నాయి. కానీ వాటికి బల్బులు లేవు. ఎల్ఈడీ బల్బులు బిగిస్తామని దశాబ్ద కాలంగా ఊరిస్తున్నారు. కానీ ఇప్పటికి ఒక్క బల్బు బిగించలేదు. ఉన్న స్తంభాలు నేలకొరుగుతున్న పట్టించుకునే నాథుడే లేడు.

ఆనకట్టపై పిచ్చి మొక్కలు

ఆనకట్టపై పిచ్చిమొక్కలు పెరుగుతున్నాయి. కానీ ఇప్పటికి వాటికి శాశ్వత పరిష్కరం చూపలేదు. ప్రతి సంవత్సరం కాంట్రాక్టర్ల కడుపు నింపుటకు జంగల్ క్లియరెన్స్ పేరున టెండర్‌లు వేస్తున్నారు. మళ్లీ రెండు నెలలు తిరగక ముందే పిచ్చి మొక్కలు పెరుగుతున్నాయి. ఆనకట్ట కోతకు గురి కాకుండ ప్రాజెక్ట్ వైపు బండరాళ్లతో రివిట్ మెంట్ ఏర్పాటు చేశారు. కానీ ప్రాజెక్ట్‌లో భారీ వరదలు రావడంతో రివిట్‌మెంట్ కోతకు గురవుతు వస్తుంది. ఏడేళ్ల క్రితం రివిట్‌మెంట్ చేశారు. దానికి ప్రతి సంవత్సరం నిర్వహణ మరిచారు. ఫలితంగా మళ్లీ రివిట్ మెంట్ కోతకు గురై బుంగ పడే ప్రమాదం ఉంది.



ఆనకట్టపై పెరిగిన పిచ్చి మొక్కలు

పూడిక ముప్పు

శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌ను వేధిస్తున్న ప్రధాన సమస్య పూడిక. ప్రాజెక్ట్‌ను 112 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించారు. 1994లో చేపట్టిన సర్వే ప్రకారం 90 టీఎంసీలకు నీటి సామర్థ్యం పడిపోయింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఎంతో పూడిక చేరి ఉంటుంది. ప్రాజెక్ట్ అధికారుల రికార్డుల్లోనే ప్రతి సంవత్సరం ఎగువ ప్రాంతాల నుంచి వరదల వలన 0.8 టీఎంసీల పూడిక వస్తుందని పేర్కొంటున్నారు.



శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్

భద్రత డొల్లా..

శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ ఆనకట్టపై భద్రత కరువైంది. ప్రాజెక్టుకు తీవ్రవాదుల ముప్పు ఉందని ఇంటెలిజెన్స్ అధికారులు హెచ్చరించినా భద్రత గురించి ఎవరు పట్టించుకోవడం లేదు. గతంలో ప్రాజెక్ట్ ఆనకట్టపై సబ్ కంట్రోల్ బూత్ ఏర్పాటు చేశారు. నాలుగేళ్ల క్రితమే సబ్ కంట్రోల్ బూత్‌ను ఎత్తివేశారు. ప్రాజెక్ట్ భద్రత గాలిలో దీపంలా మారింది.

పర్యాటక అభివృద్ధి శూన్యం

శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌ను పర్యాటకంగా అభివృద్ధి చేయడం లేదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రాజెక్ట్ దిగువన పార్కు నిర్మించారు. అప్పటి నుంచి పర్యాటకుల కోసం ఎలాంటి పనులు చేపట్టలేదు. ఉన్న బోటు షికారు కూడా మూలన పడింది. పోచంపాడ్ నుంచి బాసర వరకు బోటు ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. మల్లన్న గుట్ట వరకు రోప్‌వే ఏర్పాటు చేస్తామన్నారు. కానీ అవి ప్రతిపాదనలకే పరిమితమయ్యాయి.

టిప్పర్ ఢీకొని ఒకరికి గాయాలు

రెంజల్: ఇసుక టిప్పర్ ఢీకొని ఒకరికి గాయాలైనట్లు ఎస్సై సాయన్న తెలిపారు. బోధన్ మండలం కొప్పర్గ గ్రామం నుంచి శనివారం రాత్రి నీలా మీదుగా మండలంలోకి ప్రవేశిస్తున్న టిప్పర్ ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. దీంతో ట్రాక్టర్ బోల్తా పడి డ్రైవర్ కాలు విరిగిందన్నారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు టిప్పర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి టిప్పర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు.

రైలులో నుంచి పడి ఒకరికి ..

కామారెడ్డి క్రైం: రైలులో నుంచి జారిపడి ఒకరికి తీవ్ర గాయాలైన ఘటన పాత రాజంపేట రైల్వే గేటు సమీపంలో ఆదివారం సాయంత్రం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. నిజామాబాద్‌లోని గోల్ హనుమాన్ కాలనీకి చెందిన ప్రకాశ్ ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తూ తలుపు దగ్గర కూర్చొన్నాడు. ప్రమాదవశాత్తు పాత రాజంపేట గేటు సమీపంలో కింద పడిపోయాడు. అతడికి తీవ్ర గాయాలు కాగా ఏరియా ఆస్పత్రికి తరలించి వైద్యం అందిస్తున్నట్లు రైల్వే ఎస్సై తావూనాయక్ తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

మాక్లూర్: మండలంలోని ఒడ్డెట్‌పల్లి శివారులోని గుట్టపై ఆదివారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్టు ఎస్సై యాదగిరిగౌడ్ తెలిపారు. సుమారు 45 ఏళ్ల వయస్సు గల వ్యక్తి మృతి చెందిన విషయం పశువుల కాపర్ల ద్వారా తెలియటంతో ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించిచామన్నారు. మృతుడి ఒంటిపై నల్ల ప్యాంటు, బ్లూ కలర్ చొక్కా ఉన్నాయని చెప్పారు. మూడు రోజుల క్రితం మృతి చెంది ఉంటాడని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

అదృశ్యమైన వ్యక్తి శవమై దొరికాడు

కామారెడ్డి క్రైం: స్నేహితులతో కలిసి దైవ దర్శనం కోసం తిరుపతి వెళ్లిన ఓ వ్యక్తి తిరుగు ప్రయాణంలో అదృశ్యమై ఐదు రోజుల తర్వాత శవమై దొరికిన ఘటన కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని టేక్రియాల్ గ్రామంలో ఆదివారం వెలుగు చూసింది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కొత్తపల్లి భూమయ్య (42) వ్యవసాయ కూలీగా పని చేసేవాడు. గ్రామానికి చెందిన మరో ఎనిమిది మంది స్నేహితులతో కలిసి ఈ నెల 2న తిరుపతికి వెళ్లాడు. దైవ దర్శనం చేసుకుని అందరూ కలిసి రైల్లో తిరుగు ప్రయాణం అయ్యారు. ఈనెల 6న రాత్రి సమయంలో కర్నూలు జిల్లా ఆదోని స్టేషన్ దగ్గర భూమయ్య అదృశ్యమైనట్లు స్నేహితులు గమనించి చుట్టుపక్కల గాలించారు. ఆచూకీ లభించకపోవడంతో అక్కడి పోలీసులకు ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకుని గ్రామానికి చెందిన పలువురు కుటుంబ సభ్యులతో కలిసి అతడు అదృశ్యమైన ఆదోని ప్రాంతానికి వెళ్లి గాలింపు చర్యలు చేపట్టారు. చుట్టు పక్కల గ్రామాల్లో, కాలనీల్లో భూమయ్య ఫొటోతో కూడిన పోస్టర్లు అతికించారు. ఆదోని ఏరియా ఆస్పత్రిలో భూమయ్య మృతదేహం ఉన్నట్లు సమాచారం రావడంతో అక్కడికి వెళ్లి నిర్ధారించారు. రైల్వే స్టేషన్ నుంచి కనిపించకుండా పోయిన భూమయ్య మద్యం, కల్లు లేకపోవడంతో పరిసర ప్రాంతాల్లో తిరిగి అనారోగ్యం పాలైనట్లు గ్రామస్తులు తెలిపారు. అతడు ఆదోని ప్రాంతంలోని ఓ చోట రోడ్డు పక్కన పడిపోగా స్థానికులు ఆస్పత్రిలో చేర్పించినట్లు తెలిసింది. అప్పటికే తీవ్ర అనారోగ్యంతో ఉండటంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడని గ్రామస్తులు తెలిపారు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు.



భూమయ్య (ఫైల్)

పొదల్లోకి దూసుకెళ్లిన వాహనం

నిజాంసాగర్: నిజాంసాగర్ నుంచి శంకరంపేట వైపు వెళ్తున్న గూడ్స్ క్యారియర్ వాహనం ఆదివారం మండలంలోని మాగి శివారులో మూలమలుపు వద్ద పొదల్లోకి దూసుకువెళ్లింది. సదరు వాహన డ్రైవర్ నిద్రలోకి జారుకోవడంతో వాహనం అదుపు తప్పి ముళ్లపొదలు, చెట్లకొమ్మలను ఢీకొంది. ప్రమాదంలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలైనట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.



లారీ బోల్తా



పెద్దకొడప్‌గల్: మండలంలోని చిన్న తక్కడ్‌పల్లి గ్రామ శివారులో అదుపు తప్పి లారీ బోల్తా పడింది. మిర్యాలగూడ నుంచి నాందేడ్ వైపు వెళ్తున్న లారీ ఆదివారం ఉదయం 7 గంటల సమయంలో చిన్నతక్కడ్‌పల్లి శివారులోని జాతీయ రహదారి 161 పక్కన అదుపు తప్పి బోల్తా పడింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని గాయపడిన లారీ డ్రైవర్‌ను ఆస్పత్రికి తరలించారు. రెండు క్రేన్ల సాయంతో ఎస్సై కోనారెడ్డి లారీని పక్కకు తీయించారు.

క్రైం కార్నర్

బోన్ క్యాన్సర్‌తో విద్యార్థి మృతి

నస్రుల్లాబాద్(బీర్కూర్): బీర్కూర్ మండల కేంద్రానికి చెందిన అరిగె గణేష్(14) అనే విద్యార్థి బోన్ క్యాన్సర్‌తో ఆదివారం మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గణేష్ 20 నెలలుగా క్యాన్సర్‌తో బాధ పడుతున్నాడు. వైద్యం కోసం తల్లిదండ్రులు రూ.20 లక్షలు ఖర్చు చేశారు. అయినా ప్రాణాలు దక్కలేదు. గణేష్ వర్ని మండలంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో చదువుతున్నాడు.

చెరువులో పడి గొర్రెల కాపరి..

ఖలీల్‌వాడి: డిచ్‌పల్లి మండంలోని ఘన్‌పూర్ గ్రామానికి చెందిన బుర్రె ప్రవీణ్(27) చెరువులో పడి మృతి చెందినట్లు ఎస్సై గణేశ్ తెలిపారు. వివరాలు.. ప్రవీణ్ శనివారం ఉదయం 10 గంటలకు గొర్రెలను మేపటానికి వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. ఆదివారం ఉదయం 6 గంటలకు ఘన్‌పూర్ చెరువులో మృతదేహం లభించినట్లు తెలిపారు. మృతుడి భార్య అనూష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గణేశ్ తెలిపారు.

అప్పుల బాధతో ఆత్మహత్య

ఇందల్వాయి: మండలంలోని మల్లాపూర్ గ్రామానికి చెందిన వడ్ల రాజు(36) అప్పుల బాధతో ఆదివారం ఉదయం ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై నరేష్ తెలిపారు. వివరాలు.. రాజుకు భార్య వరలక్ష్మి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆయన ఇంటి నిర్మాణం కోసం అప్పులు చేశాడు. దీనికి తోడు భార్య అనారోగ్యానికి గురి కావడంతో మానసికంగా కుంగిపోయి మద్యానికి బానిస అయ్యాడు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం మద్యం మత్తులో బెడ్ రూమ్‌లోకి వెళ్లి ఉరి వేసుకున్నాడు. వరలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.